నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, గురువారం 18 జూలై 2024 | BHADRADRI KOTHAGUDEM

పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

డీఆర్ఎం భర్తీశ్‌కుమార్ జైన్

పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం భర్తీష్‌కుమార్ జైన్

కొత్తగూడెం టౌన్, జూలై 17 : కొత్తగూడెం (భద్రాచలం రోడ్) రైల్వేస్టేషన్‌లో ఆధునీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రైల్వే డీఆర్ఎం భర్తీశ్‌కుమార్ జైన్ ఆదేశించారు. రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను బుధవారం ఆయన పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ప్రత్యేక ట్రైన్‌లో కొత్తగూడెం చేరుకున్న ఆయన.. ఏరియాలోని అన్ని రైల్వే సెక్షన్లను, కార్యాలయాలను తనిఖీ చేశారు. ఆయన వెంట రైల్వే అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సీఎం బ్రేక్‌ఫాస్ట్‌కు మంగళం?

- గత కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన పథకానికి విశేష ఆదరణ
- మండలానికి ఒక పాఠశాల చొప్పున 23 స్కూళ్లలో అమలైన స్కీం
- ఇప్పుడు బిల్లులు నిలిపేసి పథకాన్ని అటకెక్కించిన రేవంత్ సర్కారు
- జిల్లాలో వంట కార్మికులకు ఇప్పటికే రూ.20 లక్షల బిల్లుల బకాయి
- సొంత ఖర్చులతో నెట్టుకొచ్చిన టీచర్లు, వర్కర్లకూ అందని బిల్లులు
- 'సీఎం బ్రేక్ ఫాస్ట్' పథకాన్ని నడవడం లేదంటున్న అధికారులు
- మళ్లీ ఉదయాన్నే ఖాళీ కడుపులతో పాఠశాలకు వస్తున్న విద్యార్థులు
- అమలులో ఉన్న పథకాన్ని విస్తరించాల్సిందిపోయి.. మొత్తానికి ఎత్తేసిన కొత్త సర్కారు

కొత్తగూడెం ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో సీఎం బ్రేక్ ఫాస్ట్‌లో అల్పాహారం తింటున్న విద్యార్థులు (ఫైల్)

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 17 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో చాలామంది ఉదయాన్నే స్కూలుకు వచ్చే సమయంలో ఇంట్లో అల్పాహారం ఏమీ తినకుండానే బయలుదేరుతున్నారు. టెన్త్ విద్యార్థులైతే ప్రత్యేక తరగతుల కోసం మరికొంతముందుగానే బయలుదేరి వచ్చేవస్తున్నారు. ఈ క్రమంలో కొందరు విద్యార్థులు ప్రార్థన సమయంలో కళ్ల తిరిగి కిందపడిపోవడం, మరికొందరు క్లాసుల మధ్యలోనే నీరసించిపోవడం వంటి ఘటనలు జరిగేవి. దీంతో ఉదయం వేళ కూడా విద్యార్థుల ఆకలి తీర్చాలని, రుచికరమైన ఆహారం అందించి వారిని ఇష్టంగా పాఠశాలల రప్పించాలని, ఫలితంగా హాజరుశాతం కూడా పెరుగుతుందని గత కేసీఆర్ ప్రభుత్వం భావించింది. ఇందుకోసం 2023 అక్టోబర్ 6న అప్పటి కేసీఆర్ ప్రభుత్వం 'సీఎం బ్రేక్ ఫాస్ట్' పథకానికి శ్రీకారం చుట్టింది. తొలుత ఒక్కో మండలంలో ఒక్కో పాఠశాలను ఎంపిక చేసి ఈ పథకాన్ని అమలు చేసింది. రోజుకో రకం అల్పాహారం చొప్పున రుచికరమైన ఆహారం అందించడంతో విద్యార్థుల నుంచి, వారి తల్లిదండ్రుల నుంచి ఈ పథకాన్ని అనూహ్య స్పందన లభించింది. విశేష ఆదరణ పొందింది. కానీ కొత్తగా వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఈ పథకానికి మంగళం పాడింది.

వచ్చీరావడంతోనే అటకెక్కించింది..

అప్పటి వరకూ ఆదరణ పొందిన ఈ పథకాన్ని కొత్త సర్కారు వచ్చీరాగానే అటకెక్కించింది. మండలానికి ఒకటి చొప్పున భద్రాద్రి జిల్లాలోని 23 మండలాల్లో కొనసాగిన ఈ పథకం.. కొత్త సర్కారు పట్టించుకోకపోవంతో మూలనపడింది. అయితే తరువాతైనా సర్కారు బిల్లులు చెల్లిస్తుందేమోననుకొని చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, వంట కార్మికులు సొంత నగదుతో పథకాన్ని నడిపించారు. గత విద్యాసంవత్సరం ముగిసిన ఏప్రిల్ వరకూ దుకాణాల దగ్గర అప్పులు తెచ్చిమరీ విద్యార్థులకు అల్పాహారం అందించారు. కానీ వారి బిల్లుల బకాయిలపై ప్రభుత్వం నోరు మెదపలేదు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలో కొత్త ప్రభుత్వమేమీ ఆదేశాలు ఇవ్వకపోవడం, పథకాన్ని కొనసాగించకపోవడం వంటి కారణాలతో పథకం మొత్తానికి నిలిచిపోయింది. అయినప్పటికీ మరికొందరు ఉపాధ్యాయులు, ఇంకొంతమంది వంట కార్మికులు చొరవ చూపి కొన్ని రోజులపాటు ఉదయం వేళలో విద్యార్థులకు టిఫిన్ అందించినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. బిల్లుల చెల్లింపు ప్రస్తావన లేదు. దీంతో వారు కూడా తమ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. దీంతో విద్యార్థుల ఆకలి పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. చాలామంది విద్యార్థులు ఇప్పటికీ ఖాళీ కడుపులతో పరుగుపరుగున పాఠశాలలకు వస్తున్నారు. ఉన్న పథకాన్ని విస్తరించాల్సిందిపోయి.. కొత్త సర్కారు వచ్చి మొత్తానికి ఎత్తేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ.20 లక్షల బకాయిలు..

కొత్త సర్కారు కొలువుదీరిన డిసెంబర్ నెల దగ్గర నుంచి గత విద్యాసంవత్సరం ముగిసిన ఏప్రిల్ నెల వరకూ సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకానికి పైసా విదిల్చలేదు రేవంత్‌రెడ్డి సర్కారు. దీంతో విద్యార్థులకు అల్పాహారం వండి అందించిన వర్కర్లకు ఇప్పటికీ బిల్లులు అందలేదు. భద్రాద్రి జిల్లాలో ఈ బిల్లుల బకాయి సుమారు రూ.20 లక్షలుగా ఉందని అధికారులు చెబుతున్నారు. అప్పటికే వారు కిరాణా దుకాణాల వద్ద అప్పులు తెచ్చి మరీ అల్పాహారం అందించడం, ఇన్నాళ్లు నగదు చెల్లించకపోవడంతో కిరాణా దుకాణాల యజమానులు వంట కార్మికులను ప్రశ్నిస్తుండడం, వారేమో ఉపాధ్యాయులను వేడుకుంటుండడం, వారేమో సమాధానాలు చెప్పలేకపోతుండడం వంటి ఘటనలు ఆయా పాఠశాలల వద్ద కన్పిస్తున్నాయి. అంతంత పెద్ద మొత్తంలో పేరుకుపోయిన బకాయిలను చెల్లించలేని వంట కార్మికులు.. కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు. తమ పిల్లల నోటికాడి అల్పాహారాన్ని ఆపివేశారంటూ విద్యార్థుల తల్లిదండ్రులేమో నిట్టూర్చుతున్నారు.



సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని నడపడం లేదు..

జిల్లాలో గతంలో 23 పాఠశాలల్లో సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం కొనసాగింది. గత ఏప్రిల్ నుంచి జిల్లాలో కొనసాగించడం లేదు. ఈ పథకాన్ని అమలుచేయాలని ప్రభుత్వం నుంచి కూడా ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రస్తుతానికి ఈ విద్యాసంవత్సరంలో జిల్లాలో ఈ పథకాన్ని నడిపించడం లేదు. ఇప్పటి వరకూ వంట చేసిన వాళ్ల బిల్లులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ మధ్యే కొంత బడ్జెట్ వచ్చింది.

–వెంకటేశ్వరాచారి, డీఈవో, భద్రాద్రి

లక్ష్మీదేవిపల్లి స్కూల్లో అల్పాహారం తయారుచేస్తున్న వంట వర్కర్

టిఫిన్ చాలా బాగుండేది..

ఉదయమే ఇంట్లో అమ్మకు చాలా భారం తగ్గేది. టిఫిన్ చెయ్యాలంటే బాగా లేట్ అయ్యేది. స్కూల్లో టిఫిన్ పెడుతున్నారంటే మా అమ్మ చాలా సంతోషపడింది. మేం కూడా త్వరగా స్కూలుకు వచ్చేవాళ్లం. పాఠశాలలో అందించే అల్పాహారం చాలా బాగుండేది. రుచికరంగా ఉండేది. ఉప్మా, పూరీ వంటివి రోజుకో రకం వండి పెట్టే వాళ్లు. కానీ ఇప్పుడు మా పాఠశాలలో టిఫిన్ వండి పెట్టడం లేదు. దీంతో ఇంటి దగ్గరే తిని వస్తున్నాం.

–ఎం.సాత్విక్, సుజాతగర్ ప్రాథమిక పాఠశాల

మంచి పథకాలను నీరుగారుస్తున్నారు..

చిన్న పిల్లలకు బడుల్లో టిఫిన్ పెట్టడం వల్ల కూలి పనులకు వెళ్లే తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పేవి. పేదవాళ్లే కదా సర్కారు బడులకు వచ్చేది. ఇలాంటి పథకాన్ని కూడా రాజకీయంగా తీసేస్తే ఎలా? సర్కారు బడులకు పిల్లల సంఖ్య ఎలా పెరుగుతుంది? ఇలాంటి మంచి పథకాలను నీరుగారిస్తే ఎలా? వ్యవసాయ పనులకు వెళ్లే పేద కుటుంబాల వారు ఉదయాన్నే సద్ది కట్టుకొని వెళ్తారు. ఇకవారు పిల్లలకు పిల్లలకు టిఫిన్ ఎప్పుడు చేసిపెట్టగలరు? కొత్త ప్రభుత్వం ఈ విషయాన్ని కూడా ఆలోచించకపోతే ఎలా?

–లావుడ్యా సత్యనారాయణ, గ్రామస్తుడు, సీతంపేట

కిరాణా షాపు వద్ద రూ.80 వేలు బాకీ పడ్డాం..

పిల్లలకు స్కూల్లో టిఫిన్ పెట్టడం బాగానే ఉంది. కానీ కొత్త సర్కారు మాకు ఇంత వరకూ బిల్లులు చెల్లించలేదు. దీంతో మేం పిల్లలకు అల్పాహారం వండి పెట్టలేపోతున్నాం. గత బిల్లులే ఇంత వరకూ ఇవ్వలేదు. కిరాణా షాపులో రూ.80 వేలు బాకీ పడ్డాం. వాళ్లు నిత్యం మందలించి బకాయిలు చెల్లించాలంటూ అడుతున్నారు. దీంతో మేం కూడా వారి దుకాణం వైపు వెళ్లలేకపోతున్నాం. భార్యాభర్తలం కలిసి విద్యార్థులకు ఇన్నాళ్లు వంట చేసిపెట్టినా మాకు తిండి ఖర్చులు కూడా రాలేదు.

–షేక్ సైదాని, ఖాసీం, వంటవర్కర్లు, సుజాతనగర్

- తొలివిడతలో రూ.లక్షలోపు రైతులకు మాఫీ
- రైతువేదికల్లో సంబురాలకు ఏర్పాట్లు

నేటి నుంచి రుణమాఫీ ప్రక్రియ షురూ

ఖమ్మం వ్యవసాయం, జూలై 17 : రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీకి సంబంధించిన ప్రక్రియను ప్రారంభించింది. రూ.2 లక్షలలోపు పంట రుణాలు తీసుకున్న రైతులకు ఈ రుణమాఫీ వర్తించనున్నది. అయితే ఆగస్టు 15వ తేదీలోపు మొత్తం మూడు విడతలుగా రూ.లక్ష, రూ.1.50 లక్షలు, రూ.2 లక్షలు కేటగిరిల వారిగా రైతు ఖాతాల్లో జమ చేస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. జిల్లావ్యాప్తంగా 2018 సంవత్సరం నుంచి 2023 డిసెంబర్ 9లోపు తీసుకున్న రైతులు సుమారుగా 3,73,157 మంది ఉండగా, వారికి రూ.4,307.58 కోట్లు మాఫీ అయ్యే అవకాశం ఉంది, అయితే తొలి విడతకు సంబంధించి నేడు రూ.లక్షలోపు పంట రుణాలు తీసుకున్న రైతులకు ప్రభుత్వం రుణమాఫీ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. దీంతో తొలివిడతలో 57,857 మంది రైతులు రుణవిముక్తులు కానున్నారు. రైతు రుణమాఫీ ప్రక్రియ వేడుకలకు సంబురంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున రైతులను సమీకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. సాయంత్రం 4గంటలకు జిల్లాలోని 130 రైతువేదికల్లో రుణమాఫీ సంబురాలు జరగనున్నాయి. ఈ ప్రక్రియను రైతులు నేరుగా వీక్షించేందుకు గాను వ్యవసాయశాఖ అధికారులు ఎంపిక చేసిన రైతువేదికల్లో ఎల్ఈడీలను సిద్ధం చేశారు.

దేవరపల్లి హైవే ఎంట్రీ, ఎగ్జిట్లపై 'తుమ్మల' సమీక్ష


అధికారులకు సూచనలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, జూలై 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ఖమ్మం ధంసలాపురం వద్ద ఏర్పాటుచేయాల్సిన ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం హైదరాబాద్‌లో సమీక్షించారు. రెండు డిజైన్లను సమర్పించిన అధికారులతో ఆయన మాట్లాడారు. రైతులు నష్టపోకుండా తక్కువ భూసేకరణ జరిగేలా చూడాలని ఆదేశించారు. ఆ మేరకు డిజైన్ ఆమోదించాలని నేషనల్ హైవేస్ అధికారులను మంత్రి కోరారు. ధంసలాపురం వద్ద ఎంట్రీ, ఎగ్జిట్‌లను త్వరితగతిన ఆమోదించి పనులను పూర్తి చేయాలన్నారు. అంతేగాక ముదిగొండ నుంచి వెంకటగిరి మధ్య బ్లాక్ స్పాట్ ఉన్నందున ఫోర్ లైన్ల రహదారిగా విస్తరించి స్టేట్ హైవేకు అప్పగించాలని నేషనల్ హైవేస్ ఆథారిటీ ఆఫ్ ఇండియా రీజినల్ ఆఫీసర్ రంజాన్‌కు మంత్రి తుమ్మల లేఖ రాశారు.

శ్రీశ్రీ సర్కిల్‌లో గందర గోళం!

- బారికేడ్ల ఏర్పాటుతో తగ్గిన రోడ్డు వెడల్పు
- నిత్యం ప్రమాదాల బారిన వాహనదారులు
- కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న ట్రాఫిక్ పోలీసుల తప్పిదం
- కనిపించని సూచిక బోర్డు.. ఏ దారి ఎటు వెళ్తుందో తెలియక అమోమయం

లారీ ఢీకొట్టడంతో విరిగిన సిమెంట్ బారికేడ్లు

శ్రీశ్రీ సర్కిల్ వద్ద రోడ్డును విభజిస్తూ ఏర్పాటు చేసిన బారికేడ్లు

రఘునాథపాలెం, జూలై 17 : ఖమ్మం నగర శివారులోని వైరారోడ్డులో శ్రీశ్రీ సర్కిల్ వద్ద రోడ్డు విషయంలో ట్రాఫిక్ పోలీసుల తప్పిదం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రోడ్డును రెండుగా చీల్చుతూ అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేయడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారినపడుతున్నారు. ఏ దారెటు వెళ్తుందో కూడా తెలియక వాహనదారులు అయోమయానికి గురౌతున్నారు. వైరా నుంచి ఖమ్మం నగరంలోకి ప్రవేశించే సమయంలో శ్రీశ్రీ సర్కిల్ వద్ద ఉన్న బారికేడ్లతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై ప్రత్యేక కథనం.

ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్ వద్ద చీలిక రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. వైరా నుంచి ఖమ్మంలోకి ప్రవేశించే రోడ్డును రెండుగా వేరు చేస్తూ బారికేడ్లు ఏర్పాటు చేయడంతో వాహనదారులు అయోమయానికి గురౌతున్నారు. ఓ రహదారి ఖమ్మం నగరంలోకి వెళ్లేది కాగా.. మరొకటి బైపాస్‌కు మళ్లించేందుకు ఏర్పాటు చేశారు. అయితే ట్రాఫిక్ పోలీసుల ఉద్దేశం మంచిదే ఐనప్పటికీ సూచికబోర్డు లేకపోవడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. తీరా దగ్గరకు వచ్చాక ఏ రోడ్డులో వెళ్లాలో తెలియక బారికేడ్లకు వాహనాలను ఢీకొట్టేస్తున్నారు. ఇక్కడ నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రిపూట ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. భారీ వాహనాలకు రోడ్డు సరిపోక బారికేడ్లను ఢీకొట్టి వెళ్తున్నాయి. అయితే 'బైపాస్' అని ఉన్న మార్క్ సూచికబోర్డు కనిపించనంత దూరంలో ఉండడంతో ఏ దారి ఎటు వెళ్తుందో..? తెలియని ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నట్లు తెలుస్తోంది. సోమవారం రాత్రి ఓ లారీ కాంక్రీట్ బారికేడ్లను ఢీకొట్టి ప్రమాదానికి గురైంది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు వాటికి మరికొన్ని ఐరన్ బారికేడ్లను జోడించి పెట్టారు. రోడ్డును రెండుగా విభజించడంతో రెండు రోడ్ల వెడల్పు తక్కువగా ఉంది. దానికితోడు అక్కడ నిలుస్తున్న వాహనాలతోనూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఎటు వెళ్లాలో గందరగోళంగా ఉంది..

శ్రీశ్రీ సర్కిల్ వద్ద ఖమ్మంలోకి ప్రవేశించే సమయంలో రోడ్డును రెండుగా చేస్తూ బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఏ రోడ్డు ఎటు వెళ్తుందో తెలియక కన్‌ఫ్యూజ్ అవుతున్నాం. అనేక మంది ప్రమాదాల బారినపడ్డారు. పలువురు అయోమయంలో అక్కడ ఉన్న బారికేడ్లను ఢీకొట్టి వెళ్లిన సందర్భాలూ ఉన్నాయి. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి. **– జాన్ సామ్యూల్, ఆటోడ్రైవర్, ముదిగొండ**

నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 17: డీఎస్సీ 2024 పరీక్షలను ఈ నెల 18 నుంచి ఆగస్టు 5 వరకు నిర్వహిస్తున్నట్లు ఖమ్మం డీఈవో సోమశేఖరశర్మ బుధవారం తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11:30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఉపాధ్యాయ ఎంపిక పరీక్ష తొలిసారిగా ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందని, జిల్లాలో 6 కేంద్రాల్లో 13 రోజులపాటు పరీక్షలు జరుగుతాయని అన్నారు. మొత్తంగా 25,204 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. 137 మంది దివ్యాంగ అభ్యర్థులు సహాయకులు కావాలని దరఖాస్తు చేసుకున్నారు. సందేహాల నివృత్తి కోసం అభ్యర్థులు 9951212603కు ఫోన్ చేయాలని సూచించారు.

పటిష్ట బందోబస్తు: ఖమ్మం సీపీ

మామిళ్లగూడెం, జూలై 17: ఖమ్మం కమిషనరేట్ పరిధిలో డీఎస్సీ పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ చట్టం–2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో ఉంటుందని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఖమ్మంలో 6 కేంద్రాల్లో పరీక్షలు ఉంటాయని అన్నారు.

163 బీఎన్ఎస్ఎస్ అమలు: డీఎస్పీ

కొత్తగూడెం క్రైం, జూలై 17: డీఎస్సీ పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) అమలు చేయనున్నట్లు కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ బుధవారం తెలిపారు. కొత్తగూడెం జిల్లా పరిధిలో ఈ నెల 18 నుంచి ఆగస్టు 5 వరకు జరిగే డీఎస్సీ పరీక్షల నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

నేడు జడ్పీ సమావేశం

మామిళ్లగూడెం, జూలై 17: జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం గురువారం జిల్లా పరిషత్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో వినోద్ బుధవారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్నిశాఖల జిల్లాస్థాయి అధికారులు ఉదయం 10గంటల వరకు హాజరుకావాలని సూచించారు.

తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద

25 గేట్ల ద్వారా నీటి విడుదల

తాలిపేరు ప్రాజెక్టు 25 గేట్ల నుంచి విడుదలవుతున్న వరద

చర్ల, జూలై 17 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతున్నది. ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ అడవుల్లో కురుస్తున్న వర్షాల కారణంగా వరద వస్తున్నది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 74 మీటర్లుండగా బుధవారం 73.60 మీటర్లకు చేరుకుంది. దీంతో అధికారులు ప్రాజెక్టుకు ఉన్న మొత్తం 25 గేట్లలో 5 గేట్లు పూర్తిగా, 20 గేట్లు రెండు అడుగుల మేర ఎత్తి 70.75 క్యూసెక్కుల నీటిని దిగువనున్న గోదావరిలోకి వదిలారు. వరద ఇంకా వచ్చే అవకాశం ఉందని, సిబ్బందిని అప్రమత్తం చేశామని అధికారులు తెలిపారు.

కిన్నెరసానిలోకి చేరుతున్న వరద

12 వేల క్యూసెక్కులు విడుదల

కిన్నెరసాని మూడు గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న వరద నీరు

పాల్వంచ రూరల్, జూలై 17 : కిన్నెరసాని ఎగువ ప్రాంతాలైన ఇల్లెందు, బయ్యారం, టేకులపల్లి తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి వరద నీరు కిన్నెరసాని రిజర్వాయర్‌లో వచ్చి చేరుతున్నది. దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం క్రమేణా పెరుగుతున్నది. వరద చేరికతో కిన్నెరసాని నిండుకుండలా కనిపిస్తున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా, బుధవారం రాత్రి 402.8 అడుగులకు చేరింది. ప్రాజెక్టు అధికారులు మూడు గేట్లు ఎత్తి 12 వేల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు వదిలారు. నీటిని విడుదల చేస్తున్నట్లు కిన్నెరసాని పరీవాహక ప్రాంతాల ప్రజలకు ముందస్తు హెచ్చరికలు చేశారు.